క్లుప్తంగా

విద్యార్థికి అభినందనలు


మల్లేష్

కర్నూలు (టౌన్): ఇటీవల తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో చైతన్య కె.2 బ్రాంచ్ 8 వ తరగతి విద్యార్థి ఎస్ఎస్ మల్లేష్ బ్లాక్ బెల్ట్ డాన్-1 సాధించాడు. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థినిని బుధవారం స్థానిక పెద్దమార్కెట్ వద్ద ఉన్న కెఎంసీ పార్కులో బీఆర్‌కే ఫౌండేషన్ అధ్యక్షులు రామక్రిష్ణ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయతీ

కర్నూలు: ప్రయాణికుడు మరిచిపోయిన బ్యాగును పోలీసుస్టేషన్‌లో అప్పగించి ఓ ఆటో డ్రైవర్ తన నిజాయతీని చాటుకున్నాడు. పేరు చెప్పుకోవడానికి ఇష్టం లేని ఓ మహిళ షరాఫ్ బజార్‌లో రెండు తులాల గొలుసుతోపాటు కొన్ని విలువైన వస్తువులను కొనుగోలు చేసి కొత్త బస్టాండ్‌కు వెళ్లేందుకు గిరి ఆటోను ఎక్కింది. అక్కడకు చేరుకున్నాక ఆమె హడావుడిలో బ్యాగును మరచిపోయి దిగింది. కాసేపటి తర్వాత ఆటో డ్రైవర్ బ్యాగును గుర్తించి వన్‌టౌన్ పోలీసులకు అందజేశాడు. అందులోని ఆభరణాలు, వస్తువుల ఆధారంగా సీఐ నాగేశ్వర్, హెడ్ కానిస్టేబుల్ ఎస్ఎంబాషా, కానిస్టే బుళ్లు మద్దిలేటి, మురళీ బాధిత మహిళను స్టేషన్‌కు రప్పించి బ్యాగును అప్పగించారు. ప్రయాణికురాలు మరిచిపోయిన బ్యాగును నిజాయతీగా తెచ్చి ఇచ్చిన గిరిని పోలీసులు,ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు ప్రభాకర్, బి. రాధాకృష్ణ, ఎస్ఎండీ షరీఫ్ అభినందించారు.

9న ఐసీఈయూ శిక్షణ తరగతులు

కర్నూలు(అర్బన్): ఈనెల 9న ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలోని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ శిక్షణ తరగతులను స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు సంఘం జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు ఆర్ సునీయ కుమార్, డివిజన్ సంయుక్త కార్యదర్శి టీ రమేష్ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ శిక్షణ తరగతులకు ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షులు పి.సతీష్, జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి ఏ.రఘునాథరెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. జిల్లాలోని ఇన్సూరెన్స్ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

10న బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో ఈనెల 10 న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా స్థాయి సీనియర్స్ విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ ప్రతినిధి దాదాబాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తి ఉన్న క్రీడాకారులు 9985161007 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు భారత్ జోడో పాదయాత్ర సమ్మేళనం

కర్నూలు: కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం పాదయాత్ర సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఏఐసీసీ నుంచి సీడీ మయప్పన్‌తోపాటు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధు యాదవ్ హాజరు కానున్నట్లు చెప్పారు. సాయంత్రం నాలుగు గంటలకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి పాదయాత్రగా బయలుదేరి నెహ్రూ రోడ్డు, చౌక్ బజార్, గడియారం హాస్పిటల్, పెద్ద మార్కెట్, పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందన్నారు. అక్కడ బహిరంగ సభ ఉంటుందన్నారు.

9, 10 తేదీల్లో రంగం రాష్ట్ర ప్రథమ మహాసభలు


మహా సభల పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాష్ట్ర ప్రథమ మహాసభలను ఈనెల 9, 10 తేదీల్లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎ.కరుణాకర్ బాబు తెలిపారు. బుధవారం కళాక్షేత్రంలో మహా సభల పోస్టర్లు, టీషర్ట్‌లను టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూరు కార్యక్రమ సమన్వయకర్త డి.జగన్నాథం, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు రంగయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరుణాకర్ బాబు మాట్లాడుతూ రంగం ప్రజా సాంస్కృతిక వేదికను బలోపేతం చేయడం కోసం రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల ప్రతినిధులతో ప్రథమ మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో వేదిక సహాయ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సభ్యులు డాక్టర్ అమరేంద్రరెడ్డి, మోజెస్ పాల్గొన్నారు.

మాతృ మరణాలకు చెక్!

- జిల్లాలో తగ్గుతున్న మాతృ మరణాలు
- గత ఏడాదితో పోలిస్తే 50 శాతం తగ్గుదల
- క్షేత్రస్థాయిలో చేపడుతున్న చర్యలే కారణం
- హై రిస్క్ గర్భిణులను దత్తత తీసుకుని చికిత్స
- సుఖప్రసవం అయ్యేవరకు పర్యవేక్షణ


వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేస్తుండటంతో వందశాతం ఆసుపత్రి ప్రసవాలు జరుగుతున్నాయి.

కర్నూలు(హాస్పిటల్): బిడ్డకు జన్మనిస్తూ ఏ స్త్రీ మరణించకూడదు...జన్మిస్తూ ఏ శిశువూ కన్ను మూయకూడదన్నది ప్రభుత్వ నినాదం. ఈ విధానంతోనే మాతాశిశు మరణాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఒక స్త్రీ గర్భం దాల్చినప్పటి నుంచి ఆమె ప్రసవించి బిడ్డకు టీకాలు పూర్తయ్యేంత వరకు కంటికి రెప్పలా కాపాడుతోంది. ప్రజల్లో అవగాహనలోపం, పేదరికం, పలురకాల వ్యాధుల కారణంగా ఇంకా పలువురు గర్భిణులు పుట్టిన బిడ్డను చూసుకోకుండానే కన్నుమూస్తున్నారు. ఇవి కూడా జరగకూడదని ప్రభుత్వం క్షేత్రస్థాయిలో చర్యలు ప్రారంభించింది.

జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఎమ్మిగనూరు, ఆదోనిలలోల ఏరియా ఆసుపత్రులు, మాతాశిశు ఆసుపత్రి, కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో యేటా 50 వేల దాకా ప్రసవాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులన్నింటిలోనూ డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేస్తుండటంతో వందశాతం ఆసుపత్రి ప్రసవాలు జరుగుతున్నాయి. గర్భిణి తన ఇష్టం మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రిలో ఎక్కడైనా చేరి సుఖప్రసవం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటోంది. దీంతో పాటు గర్భం దాల్చిన వెంటనే ఏఎన్ఎం యాప్‌లో పేరు నమోదు చేయించి, ప్రసవం అయ్యేవరకు పర్యవేక్షిస్తున్నారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో మాతృమరణాలు తగ్గుముఖం పట్టాయి.

గర్భిణికి నిరంతరం పరీక్షలు

మహిళ 12 వారాల గర్భం దాల్చిన వెంటనే ఏఎన్ఎంలు తమ యాప్‌లో నమోదు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రతి నెలా 9న ప్రతి ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృవందన యోజన కార్యక్రమం ద్వారా గర్భిణులకు అన్ని పరీక్షలు నిర్వహించి మాతాశిశు సంరక్షణ కార్డులో వివరాలు నమోదు చేస్తున్నారు. కడుపులోని బిడ్డకు చేసే టిఫా స్కానింగ్ సైతం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ఉచితంగా నిర్వహించేలా ఏర్పాటు చేసింది.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రతినెలా గర్భిణికి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తూ రక్తహీనత, హైబీపీ లేకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. హైరిస్క్ గర్భిణిగా గుర్తించిన వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్నారు. ఆశా, ఆరోగ్య కార్యకర్త పర్యవేక్షణలో ఆమెను పర్యవేక్షిస్తూ ప్రసవ తేదీకి వారం ముందుగానే ఆసుపత్రిలో చేర్పించి వైద్యుల పర్యవేక్షణలో సుఖప్రసవం అయ్యేలా చూస్తున్నారు. ఈ మేరకు గర్భిణుల కుటుంబీకులకు సైతం అవగాహన కల్పిస్తున్నారు.

రక్తహీనతను తగ్గించేందుకు చర్యలు

రక్తహీనత లేకుండా గర్భం దాల్చిన వెంటనే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇస్తున్నారు. తీవ్ర రక్తహీనత ఉన్న గర్భిణులకు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు ఎక్కిస్తున్నారు. 7 శాతంలోపు ఉంటే వారికి రక్తం ఎక్కించి ప్రసవ సమయంలో ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు. 2019-20లో 75,059(95.67శాతం) మందికి, 2020-21లో 84,372(100.44శాతం) మందికి, 2021-22లో 47,994(103.71శాతం) మందికి, 2022-23లో 47,578(95.97శాతం) మందికి ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేశారు.

గత ఐదేళ్లలో జరిగిన మాతృమరణాలు

సంవత్సరం	మృతులు
2019-20	40
2020-21	28
2021-22	30
2022-23	20
2023-24	19

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత మూడేళ్లలో ఆస్పత్రుల్లో జరిగిన ప్రసవాలు

సంవత్సరం	ప్రసవాలు
2019-20	63,818(99.49 శాతం)
2020-21	62,800(99.47శాతం)
కర్నూలు జిల్లాలో ..	
2021-22	46,701(99.90 శాతం)
2022-23	52,915(వంద శాతం)

మాతృమరణాలపై సమీక్షించి చర్యలు



జిల్లాలో ప్రతి నెలా ఆయా ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగిన మాతృమరణాలపై వైద్యులు, ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశాలతో సమీక్ష నిర్వహిస్తున్నాం. ఏ మాతృమరణం ఎందుకు జరిగింది, దానికి కారణాలేమిటీ, బాధ్యులెవరో సమీక్షిస్తున్నాం. భవిష్యత్‌లో ఇలాంటి పొరపాట్లు జరగకుండా కఠినమైన ఆదేశాలు ఇస్తున్నాం. మాతృమరణాల్లో సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. మాతృమరణాలు అరికట్టేందుకు హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారిని దత్తత తీసుకుని సుఖప్రసవం అయ్యేలా విధంగా చర్యలు తీసుకుంటున్నాం. దీంతో గతంతో పోలిస్తే జిల్లాలో మాతృమరణాల సంఖ్య తగ్గుముఖం పడుతోంది.

– డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, కర్నూలు

విద్యార్థులకు సాంస్కృతికాంశాలపై పోటీలు

కర్నూలు కల్చరల్: వినాయక చవితిని పురస్కరించుకుని విద్యార్థులకు సాంస్కృతికాంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు గణేష్ మహోత్సవ కేంద్ర సమితి వారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్పర్ ప్రైమరీ, హైస్కూల్, జూనియర్ కళాశాలల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ఈనెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు బుధవారపేటలోని కేశవ మెమోరియల్ హైస్కూల్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు నిమజ్జనం రోజున బహుమతులు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు కేశవ మెమోరియల్ హైస్కూల్ హెడ్ మాస్టర్ సత్యనారాయణ 9441360037, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చెన్నయ్య 9440769600, ఉపాధ్యాయులు చింతలపల్లి రామకృష్ణ 9949566999 నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

వేధింపుల కేసు నమోదు

కల్లూరు : మండల పరిధిలోని ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేధింపుల కేసు నమోదైనట్లు ఎస్ఐ నల్లప్ప బుధవారం తెలిపారు. ఉలిందకొండ గ్రామానికి చెందిన పుణ్యవతి అదే గ్రామానికి చెందిన నడిపి సంజీవుడు ఆరు నెలల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నారు. మూడు నెలలు కాపురం సజావుగా సాగింది. ఆ తరువాత భర్తతో పాటు అత్త వెంకటేశ్వరమ్మ కట్నం కోసం సూటిపోటి మాటలతో శారీరకంగా, మానసికంగా వేధించసాగారు. ఈ మేరకు బుధవారం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త, అత్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.


చిన్మయ మిషన్‌లో కృష్ణాష్టమి వేడుకలు


మాధవీ నగర్‌లోని రవీంద్ర స్కూల్‌లో..

ముకుందా.. ముకుందా.. కృష్ణా!

- ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలు


త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకారంలో కన్నయ్య


భరత మాత మాతృ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నృత్య ప్రదర్శనలు


కేవీఆర్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో..

కర్నూలు కల్చరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరిగాయి. పలు ఆలయాల్లో నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. గోమాత పూజ, ఉట్లోత్సవం నిర్వహించారు. చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలు, నృత్యాలు అలరించాయి. పలు చోట్ల నిర్వహించిన వేడుకల్లో నగర మేయర్ బీవై రామయ్య పాల్గొన్నారు. ఇస్కాన్‌లో జరిగిన వేడుకల్లో ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు సందేశమిచ్చారు. కర్నూలు నగరంలో గో సంరక్షణ శాల, బీక్యాంప్ విజ్ఞాన మందిరం, చిన్మయ మిషన్, లలితా పీఠం, చిన్న అమ్మవారి శాల, రామిరెడ్డి తాత సంస్థాన్, సత్యసాయి మందిరం, దక్షిణ షిరిడీ సాయిబాబా ఆలయం, సూర్యనారాయణ స్వామి ఆలయం, సత్యనారాయణ స్వామి ఆలయం, భరతమాత ఆలయాల్లో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.

రుక్మిణీ సమేత శ్రీకృష్ణ మందిరంలో వేడుకలు

నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని రుక్మిణీ సమేత శ్రీకృష్ణ మందిరంలో జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. గోమాత పూజ, భజన, శ్రీకృష్ణ జన్మదిన వేడుకల లాలిపాటలు తదితర కార్యక్రమాలు జరిగాయి. డీఆర్‌ఓ నాగేశ్వరరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్, ఆదర్శ విద్యా సంస్థల అధినేత తిమ్మయ్య, యాదవ సంఘం, ఆలయ కమిటీ సభ్యులు అయ్యన్న యాదవ్, నారాయణ యాదవ్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు శ్రీకృష్ణుని చిత్రపటంతో కలెక్టరేట్ నుంచి శ్రీకృష్ణ మందిరం వరకు ర్యాలీ, 1 గంటకు ఉట్లోత్సవం, నృత్య ప్రదర్శనలు, సభ ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

రవీంద్ర గ్లోబల్ స్కూల్‌లో..

కర్నూలు సిటీ: నగర శివారులోని రవీంద్ర గ్లోబల్ స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అలరించాయి. బాల, బాలికలు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. స్కూల్ వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, వైస్ చైర్మన్ జి.వంశీధర్ పాల్గొన్నారు.

- మాధవీనగర్‌లోని రవీంద్ర ఇంగ్లీషు మీడియం, రెవెన్యూ కాలనీలోని రవీంద్ర టాలెంట్ స్కూల్‌లో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఆ స్కూళ్ల కరస్పాండెంట్ పి.బి.వి సుబ్బయ్య పాల్గొన్నారు.
- గణేష్ నగర్‌లోని హారిజాన్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో స్కూల్ చైర్మన్ పి.ప్రదీప్‌కుమార్, డైరెక్టర్ కె.పావని పాల్గొన్నారు.
- గాంధీనగర్‌లోని ఐరిస్ ఫ్లోరిట్స్ కిడ్స్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో కరస్పాండెంట్ ఐ.ఎం స్వామి పాల్గొన్నారు.
- కేవీఆర్ హై స్కూల్‌లో జరిగిన వేడుకల్లో స్కూల్ కరస్పాండెంట్ ఎస్.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేడు గోదా గోకులంలో ..



కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, గోదాగోకులం వ్యవస్థాపకులు, తితిదే ధర్మ ప్రచారమండలి సభ్యులు మారం నాగరాజు గుప్త, గోదాగోకులం ట్రస్టీ పల్లెర్ల నాగరాజు తెలిపారు. వేడుక పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు.

కౌలు రైతు ఆత్మహత్య

దేవనకొండ: మండలకేంద్రానికి చెందిన కౌలు రైతు బోయ నరసప్ప (42) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. బోయ నరసప్ప గత ఆరేళ్ల నుంచి తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు మరో మూడు ఎకరాలను కౌలుకు తీసుకుని ఉల్లి, పత్తి, మిరప మొదలైన పంటలను సాగుచేస్తూ జీవనం సాగించేవాడు. ప్రతి సంవత్సరం అతివృష్టి లేదా అనావృష్టి వల్ల పంటలు నష్టపోయి పెట్టిన పెట్టుబడి కూడా చేతికిరాక దాదాపు రూ.6 లక్షల దాకా అప్పుల పాలయ్యాడు. అప్పు ఇచ్చిన వారు తిరిగి చెల్లించాలని తీవ్ర ఒత్తిడి చేయగా మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం దేవనకొండ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడినుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం తెల్లవారజామున 5.02 గంటలకు నరసప్ప మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమార్తెలు నరసమ్మ, ఇందు ఉన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోత

కర్నూలు కల్చరల్: విద్యుత్ పురోగతి పనులు, మరమ్మతులను పురస్కరించుకుని నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ-1, 2 బుధవారం తెలిపారు. 33 కేవీ ఫీడర్ పరిధిలోని గణేష్‌నగర్, శ్రీరామ్‌నగర్, మద్దూరునగర్, రెవెన్యూ కాలనీ, పోస్టల్ కాలనీ, జోహరాపురం, చెక్‌పోస్ట్, నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీ, ధనలక్ష్మి నగర్, మారుతి మెగా సిటీ, న్యూ కమలా నగర్, లక్ష్మి టౌన్‌షిప్, శ్రీవారి కుటీర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా పక్కాగా రూపొందించాలి


పంచలింగాలలో ఇంటింటి ఓటర్ల సర్వేను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్

కర్నూలు (న్యూటౌన్): ఓటర్ల జాబితాను పక్కాగా, పారదర్శకంగా రూపొందించాలని కర్నూలు ఆర్డీఓ సి.హరిప్రసాద్ బీఎల్ఓలను ఆదేశించారు. బుధవారం కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో ఇంటింటా ఓటర్ల సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటర్ల సర్వే రికార్డులను పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ 2024 కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. బీఎల్ఓలు గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి మొబైల్‌లో ఓటర్ల పూర్తి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. సవరణలతో పాటు ఫోటో, అడ్రస్ మార్పులు వంటివి ఓటరు ఆమోదంతో చేయాలని సూచించారు. 2024 జనవరి 5వ తేదీన తుది జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుందని వెల్లడించారు. కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు, వీఆర్‌ఓ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రజక ఉపాధ్యాయులకు సన్మానం


సన్మానం పొందిన రజక సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయులు

కర్నూలు(అర్బన్):జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రజక విద్యా సేవా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల రజక సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. స్థానిక సేవా సమితి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి రజక విద్యా సేవా సమితి అధ్యక్షులు సీపీ వెంకటేష్, గౌరవ సలహాదారు ఎం నాగన్న తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దూరు వెంకట్,రాష్ట్ర నాయకులు లింగమయ్య, జగదీష్, రజక సంఘం ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు వాడాల నాగరాజు, జిల్లా అధ్యక్షులు గోల్డ్‌మెన్ శ్రీను, నాగటూరు వెంకటేష్, ఎల్ఐసీ మద్దిలేటి పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



ఆదోని సెంట్రల్: ఆలూరు మండలం మొలగవల్లి గ్రామం రైల్వేగేట్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. మొలగవల్లి-నేమకల్లు ఆర్ఎస్ లైన్ మధ్య మొలగవల్లి ఆర్ఎస్ యార్డులో కిలోమీటర్ నంబర్.462/26-28 వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడు వయస్సు 65 సంవత్సరాలు ఉంటుందని, తెల్లని చొక్కా,పంచె ధరించాడు. చేతికి ఇత్తడి కడియం ఉంది. చొక్కాకు వెంకటేష్ టైలర్, ఆలూరు లేబల్ ఉంది. డిప్యూటీ ఎస్ఎంఆర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ. రామస్వామి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ 91 8886454595 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బస్సు యాత్ర ముగింపు సభకు తరలిరావాలి

కర్నూలు: తిరుపతిలో ముగిసే బస్సు యాత్ర సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి పార్టీ కార్యకర్తలు, నాయకులకు సూచించారు. బుధవారం సీఆర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 8న బస్సుయాత్ర తిరుపతిలో ముగుస్తుందన్నారు. అక్కడే బహిరంగ సభ ఉంటుందన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శులు రాజా, నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరు కానున్నట్లు చెప్పారు.

మల్లన్న సన్నిధిలో ఏపీ స్పెషల్‌చీఫ్ సెక్రటరీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామి వార్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరభ్‌కుమార్ ప్రసాద్ బుధవారం రాత్రి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేశారు.

ఆస్తి వ్యవహారంలో మహిళ ఆత్మహత్యాయత్నం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకట లక్ష్మి

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం గొల్లమానుపల్లిలో బుధవారం దారుణం చోటు చేసుకుంది. ఆస్తి తగాదాలో అక్క వెంకట లక్ష్మిని తమ్ముడు రంగారెడ్డి గ్రామస్తుల ముందే కాళ్లతో ఇష్టానుసారంగా తన్నాడు. దీంతో మనస్తాపం చెందిన అక్క పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు, బంధువులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గొల్లమానుపల్లికి చెందిన వెంకట లక్ష్మి, రంగారెడ్డి అక్కా తమ్ముడు. వీరి మధ్య కొంతకాలంగా ఆస్తి తగాదా కొనసాగుతోంది. ఈ క్రమంలో బుధవారం రంగారెడ్డి అక్క వెంకట లక్ష్మి ఇంటికెళ్లి ఆస్తి విషయంలో గొడవ పెట్టుకున్నాడు. అంతటితో ఆగకుండా అందరూ చూస్తుండగానే కింద పడేసి ఇష్టానుసారంగా కొట్టాడు. స్థానికులు సర్దిజెప్పినా వినలేదు. దీంతో మనస్తాపం చెందిన వెంకట లక్ష్మి పురుగు మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై జొన్నగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.